క్లుప్తంగా

నిధుల దుర్వినియోగంపై విచారణ చేయండి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): దేవరకద్ర పీఏసీఎస్ కార్యాలయంలో నిధులు దుర్విని యోగం అయ్యాయని.. విచారణ జరిపించా ల్సిన అవసరం ఉందని.. పీఏసీఎస్ సభ్యుడు డోకూర్ భీమ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం డీసీఓకు వినతిపత్రం సమర్పిం చారు. దుర్వినియోగంపై పాలక వర్గాన్ని ప్రశ్ని స్తే.. ఇష్టం వచ్చినట్లు చేసుకుంటామని సమా ధానం ఇస్తున్నారని తెలిపారు.

రూ.71వేల విరాళం

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రామస్వామి గుట్టపై పురాతన కాలంలో వెలిసిన రామలింగేశ్వరస్వామి ఆలయ పునర్ని ర్మాణానికి కెకె పాలిమర్స్ పైపుల కంపెనీ యాజమాని కె.శ్రీనివాస్‌సాగర్ రూ.71వేల విరాళం అందజేశారు. గుట్ట కింది నుంచి పైన ఉన్న ఆలయం వరకు పైప్‌లైన్ ఏర్పాటు కోసం శనివారం ఆలయకమిటీ చైర్మన్ అస్కని నరేం దర్‌సాగర్‌కు నగదును అందించారు. ఆలూరి గోపి, ఎస్.తిరుపతయ్యగౌడ్, రాజేష్‌గౌడ్, కె.నారాయణ తదితరులు ఉన్నారు.

డాక్టరేట్ ప్రదానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో అధ్యాపకుడు కరుణాకర్‌రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సంపాదిం చారు. ఓయూ అధ్యాపకులు మధుమతి ఆధ్వ ర్యంలో ఆయన 'కంప్యూటర్ సెల్ఫ్ ఎఫీకసీ, కంప్యూటర్ యాంక్సైటీ అండ్ ఆటిట్యూడ్ టువర్స్ ఈ లెర్నింగ్ అమాంగ్ బీఏడ్ స్టూడెంట్స్' అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభిం చింది. ఆయనను పీయూ వైస్‌ఛాన్సలర్ లక్ష్మీకాంత్‌రాథోడ్ అభినందించారు. వీసీ ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

మహబూబ్‌నగర్ న్యూటౌన్: జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ సహాయ సంచా లకులు(డీపీఆర్వో)గా పి.శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శనివారం కలె క్టర్ రవినాయక్‌ను మర్యాదపూర్వకంగా కలి శారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో భాగంగా న ల్గొండలో పనిచేస్తున్న శ్రీనివాస్ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను కార్యా లయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వయో పరిమితి పెంచాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఐదేళ్లు వయో పరిమితి పెంచాలని తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగ పోరాట సమితిరాష్ట్ర అధ్యక్షుడు యాదయ్య డిమాండ్ చేశారు. శనివారం ఢిల్లీలో రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లురవికి వినతి పత్రం సమర్పించారు.

అధ్యక్షుడిగా భాస్కర్

చిన్నచింతకుంట: కౌకుంట్ల మండలం బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా దాసర్‌పల్లి గ్రామా నికి చెందిన భాస్కర్‌ను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ బాధ్యతలు అప్పగించినందుకు నాయకులకు రుణపడి ఉంటానన్నారు.

స్థానికులకు ఇవ్వాలి

జడ్చర్ల: లోక్‌సభ ఎన్నికలలో స్థానిక అభ్యర్థు లకే రాజకీయ పార్టీలు అవకాశాలు కల్పిం చాలని మహబూబ్‌నగర్ డెవలప్‌మెంట్ సభ్యులు డిమాండ్ చేశారు.శనివారం స్థానిక టీఎన్‌జీఓ భవనంలో వారు విలేకరుల సమావే శంలో మాట్లాడారు. రాష్ట్ర ఫకీర్ హక్కుల సం ఘం అధ్యక్షుడు జహంగీర్‌పాష, సామాజిక వేత్త అనిల్‌కుమార్‌తో పాటు ఎండీఎఫ్ చైర్మన్ రవి తదితరులు పాల్గొన్నారు.

సమావేశాలకు తరలిరండి

చిన్నచింతకుంట: జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించే సమావేశాలకు మండలంలోని ఉపాధ్యాయులు అధికసంఖ్యలో హాజరుకా వాలని టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షు రాలు జయంతి, ప్రధాన కార్యదర్శి గోపాల్‌లు శనివారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర అధ్య క్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావారవి, వీఓటీటీ పత్రిక సంపాదకులు మాణిక్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హన్వాడ: చిన్నదర్పల్లి శివారు టెంపుల్‌తండా పరిసరాల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను హన్వాడ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. వారి కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ మండల పరిధిలోని వెంకటాపూర్‌నకు చెందిన గోపాల్, రాజు తమ ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకను జిల్లాకేంద్రం వైపు తరలిస్తున్నారు. దీంతో హన్వాడ పోలీసులు శనివారం తెల్లవారుజా మున పట్టుకుని ట్రాక్టర్లను ఠాణాకు తరలిం చారు. సీజ్ చేసి గోపాల్, రాజుపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేష్ పేర్కొన్నారు.

ఉపాధ్యాయులైన విద్యార్థులు

నవాబుపేట: కూచూర్, కారుకొండ జిల్లా పరిషత్ పాఠశాలల్లో స్వయం పరిపాలన దినో త్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి వారికి చక్కగా బోధించారు. హెచ్‌ఎంలు వేణుగోపాల్‌రెడ్డి, దశరథ్‌నాయక్ పాల్గొన్నారు.

పనులు పూర్తిచేయాలి

కోయిల్‌కొండ: నర్సరీల్లో పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ జయరాములు సూచిం చారు. శనివారం పారుపల్లి నర్సరీలో పనులు పరిశీలించారు. పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు కార్యదర్శులు దృష్టిసారిం చాలన్నారు. ఏపీఓ నర్సయ్య పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్ల సంగతేంటి?



రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లి వద్ద పరిస్థితి ఇలా..

- పట్టించుకోని హైవే అథారిటీ
- రాంగ్‌రూట్‌లో వెళ్తున్న వాహనదారులు
- పెరుగుతున్న ప్రమాదాలు

రాజాపూర్: జాతీయ రహదారి 44 పక్కన సర్వీస్ రోడ్లు ఏర్పాటు అగమ్యగోచరంగా మారింది. రోడ్లు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతూ ప్రాణాలు కోల్పో తున్నారు. ముఖ్యంగా ముదిరెడ్డిపల్లితో పాటు రంగా రెడ్డిగూడ, బాలానగర్ మండలం కేతిరెడ్డిపల్లి వద్ద తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. సర్వీ స్‌రోడ్లు లేకపోవడంతో వాహనదారులు ఇష్టా నుసారం రాంగ్‌రూట్లో వెళ్తుండడం ఘటనలకు కార ణమవుతోంది. అదేవిధంగా రంగారెడ్డిగూడ వద్ద జాతీయ రహదారిపై పెట్రోల్‌బంక్ ఉండటంతో గ్రామస్తులు, ఇతర వాహనదారులు పెట్రోల్, డీజిల్ పోయించుకుని సర్వీస్‌రోడ్డు లేక రాంగ్ రూట్‌లో వస్తున్నారు. గతంలో రాంగ్ రూట్‌లో వచ్చి గ్రామా నికి చెందిన మాజీ సర్పంచ్‌ను ఓ లారీ ఢీకొట్టింది. ఘటనలో మాజీ సర్పంచ్ సత్యంగౌడ్ అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు.
ముదిరెడ్డిపల్లి వద్ద గతంలో ఓ టిప్పర్ కంకరలోడ్‌తో సమీపంలో ఉన్న పారిశ్రామికవాడలోకి వెళ్లేందుకు రాంగ్‌రూట్‌లో వెళ్తూ నాగర్‌కర్నూల్ నుంచి హైదరా బాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఘటనలో అక్కడికక్కడే 8 మంది మరణించగా మరికొందరు గాయాలపాలయ్యారు.
రాయపల్లి గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు నందిగామ, ఈర్లపల్లి గ్రామానికి చెందిన నలుగురు ముదిరెడ్డిపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద రాంగ్‌రూట్‌లో వచ్చి వాహనాలు ఢీకొనడంతో మృత్యువాతపడ్డారు.
ఇలా నాటి నుంచి నేటివరకు ఎందరో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఎన్నో ఉన్నాయి.

ప్రమాదాలు జరిగినప్పుడే హడావుడి

సర్వీస్‌రోడ్ల విషయంలో..ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు పోయినప్పుడు.. చుట్టు పక్క లగ్రామాల ప్రజలు అక్కడివచ్చి జాతీయ రహదా రిపై ఆందోళనలు చేసినప్పుడు మాత్రమే అధికా రులు వచ్చి హడావుడి చేస్తున్నారని తరువాత పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసు కుంటామని ఇటు హైవే అధికారులు, పోలీసులు చెబుతారు కానీ శాశ్వత పరిష్కారం మాత్రం చూపడం లేదని వాపోతున్నారు. వాహనదారుల నుంచి నిత్యం రూ.లక్షల్లో టోల్ రూపంలో వసూలు చేస్తారుగానీ.. ప్రాణాలు కాపాడడంలో మాత్రం నిర్లక్ష్యంగా ఉంటారని బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ముదిరెడ్డిపల్లి వద్ద ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్న నేపథ్యంలో అక్కడ ఫ్లైఓవర్ నిర్మాణం చేస్తారని ప్రజలు భావించినా ఇంకా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ నేపథ్యంలోనే ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడాలని.. మరిన్ని ప్రాణాలు పోకముందే చర్యలు తీసుకో వాలని ప్రజలు కోరుతున్నారు.

కళ్లముందే ప్రాణాలు పోయాయి



సర్వీస్‌రోడ్డు ఏర్పాటు చేసి ఉంటే మాగ్రామానికి చెందిన మహిళ రైతు మ్యాడలమ్మ ప్రాణాలు పోయి ఉండేవి కావేమో. జాతీయ రహదారి పక్కనుంచి ఆమె తమ పొలంవద్దకు వెళ్తుంటే ఓ లారీ ఢీకొనడంతో మా కళ్లముందే ఆమె ప్రాణాలు విడిచింది. ప్రస్తుతం పోలేపల్లి సెజ్‌లోకి వెళ్లేందుకు భారీ కంటైనర్లు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు సర్వీస్‌రోడ్డు లేక రాంగ్‌రూట్‌లో వెళ్లి ప్రమాదా లకు కారకులవుతున్నారు. అధికారులు సమ స్యను పరిష్కరించాలి.

– నవీన్‌గౌడ్, రాయపల్లి

చర్యలు తీసుకుంటాం



హైవేపై తరచూ ప్రమా దాలు జరిగే ప్రాంతా లను గుర్తించి నివారణ చర్యలు చేపడతాం. రాంగ్ రూట్‌లో వెళ్లే వాహ నదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుం టాం. ఈ విషయంపై హైవే అధికారులకు సైతం సమాచారం ఇచ్చి తాత్కాలికమైన చర్యలు తీసుకోవాలని తెలియజేస్తాం.

– రవి, ఎస్‌ఐ, రాజాపూర్

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి



వినతిపత్రం సమర్పిస్తున్న ఐద్వా నాయకులు

జడ్చర్ల టౌన్: అర్హులైన నిరుపేదలకు ఎర్రగుట్టలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూంలు ఇవ్వాలని ఐద్వా ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వ హయాంలో పేదలచే దరఖాస్తులు చేయించినప్ప టికీ పట్టించుకోలేదని వారు వినతిపత్రంలో పొందు పర్చారు. దరఖాస్తులు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి వెంటనే ఇళ్లు ఇవ్వాలని ఐద్వా నాయకులు నాగలక్ష్మి, లక్ష్మి కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ పాల్గొన్నారు.

రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా ఇవ్వాలి..

అర్హులైన పేదలకు డబుల్‌బెడ్‌రూంలను రేషన్ కార్డుతో సంబంధం లేకుండా కేటాయించాలని ఎంఐఎం నాయకులు శనివారం తహసీల్దార్ సత్యనారా యణరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. దరఖా స్తులు ఇచ్చేందుకు కార్యాలయానికి వస్తే రేషన్‌కార్డు లేదని తీసుకోవటం లేదని ఆయన దృష్టికి తీసుకువ చ్చారు. నాయకులు డా.జాకీర్‌అలీ, యాసర్, జాహెద్, షకీల్, ఓహెల్ ఖాద్రి పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల్లో గుబులు!

- సాయంత్రం కాగానే కార్యాలయ గదులకు తాళాలు
- ఏసీబీ వలలో ఏఈ పృథ్వీ ఘటనే కారణం



వివిధ విభాగాల గదులకు తాళాలు వేయడంతో బోసిపోయిన మున్సిపల్ కార్యాలయం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏఈగా పనిచేస్తున్న పృథ్వీ ఏసీబీ వలలో చిక్కడంతో ఉద్యోగుల్లో గుబులు మొదలైం ది. ఈ కార్యాలయంలోని అకౌంట్స్, రెవెన్యూ, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌తో పాటు శానిటేషన్, టౌన్ ప్లానింగ్ తదితర విభాగాల గదులకు సాయంత్రం కాగానే తాళాలు వేశారు. మరోవైపు అభయహస్తం లో భాగంగా సబ్సిడీ గ్యాస్ పథకంపై ఇంటింటి సర్వేలో మరికొందరు సిబ్బంది నిమగ్నమయ్యారు. దీంతో కార్యాలయం మొత్తం బోసిపోయింది. వాస్త వానికి ఈ కార్యాలయం ప్రతి రోజూ రాత్రి వరకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజలతో కళకళ లాడుతుంటుంది. అలాంటిది శనివారం ఎలాంటి అలికిడి లేకపోవడం గమనార్హం. మధ్యాహ్నం నుం చి రాత్రి వరకు ఇంజినీరింగ్ విభాగంలో ఏసీబీ అధి కారులు సోదాలు నిర్వహిస్తూనే ఉన్నారు. ఏఈని అదుపులోకి తీసుకుని గంటలతరబడి కాంట్రాక్టర్ల బిల్లులపై ఆరా తీశారు. ఈ సంఘటన నేపథ్యంలో కొందరు కాంట్రాక్టర్లు ఆవరణలో గుంపులుగా చేరి చర్చించుకోవడం కనిపించింది.

నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలి



సమస్యలు వివరిస్తున్న నాయకులు

జడ్చర్ల టౌన్: పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పరిధిలో భూనిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇప్పించాలని సీఎం సలహా దారు షబ్బీర్ అలీకి రైతురాజ్యం పార్టీ మాజీ అధ్యక్షుడు యం.బి బాలకృష్ణ వినతిపత్రం సమర్పించారు. శనివారం నిర్వాసితుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లాలని ఆయనను కోరారు. ప్రస్తుత ఆర్థిక శాఖమంత్రి భట్టి విక్రమార్క తన పాదయాత్రలో 2013 చట్టం ప్రకారం పరిహారం ఇప్పిస్తామని కరపత్రాలు వేయించారని గుర్తుచేశారు. అయితే శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిర్వాసితుల అంశాన్ని ప్రస్తావిస్తారని ఆశించి నిరాశకు గురయ్యామని తెలియజేశారు.

కారును ఢీకొట్టిన లారీ

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్ స్టేజీ వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం కారును లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ముగ్గురికి ముప్పు తప్పిపోయింది. మహబూబ్‌నగర్‌కు చెందిన సంజీవయ్యతో పాటు మరో ఇద్దరు కలిసి కారులో వనపర్తి జిల్లా పెబ్బేర్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో పొన్నకల్ స్టేజీ వద్ద కారు వెనుక లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు వెనుక భాగం దెబ్బతినగా అందులో ఉన్న ముగ్గురు ఎలాంటి గాయాలు కాకుండా ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న అడ్డాకుల పోలీసులు ప్రమాదంపై విచారణ చేపట్టారు.

జాయిన్ అవ్వలేదు.. చార్జ్ ఇవ్వలేదు

గండేడ్: ఓ పంచాయతీ కార్యదర్శి బదిలీ అయినా మరోచోట ఆర్డర్ తీసుకోకపోవడంతో పాటు.. అక్కడకు వచ్చిన వారికి సైతం చార్జ్ ఇవ్వని ఘటన మండలపరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. సల్కర్‌పేట్‌లో గ్రేడ్–4 గ్రామపంచాయతీ కార్యదర్శిగా రాధిక పనిచేస్తోంది. జనవరి 31న చిన్న చింతకుంట మండలం తిరుమలాపూర్‌నకు ఆమె బదిలీ అయ్యారు. ఈమేరకు కలెక్టర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో రెడ్డిపల్లి పంచాయతీ కార్యదర్శి రమేష్‌కు సల్కర్‌పేట్ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే బదిలీ అయినా రాధిక సదరు ఆర్డర్ తీసుకోలేదు. అంతేకాకుండా కార్యదర్శి రమేష్‌కు చార్జ్ కూడా ఇవ్వలేదు. దీంతో గ్రామంలో పలు పనుల నిర్వాహణకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మండల అధికారులకు సైతం ఆమె రాధిక అందుబాటులో లేదు. దీంతో చేసేదిలేక విషయంపై కలెక్టర్ రవినాయక్, జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శంకర్‌నాయక్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

మహమ్మదాబాద్: బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తికి గాయాలైన ఘటన ఉమ్మడి మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సల్కర్‌పేట్‌కి చెందిన కృష్ణయ్య శనివారం ఉదయం బైక్‌పై తన సొంత పనిమీద మహబూబ్‌నగర్‌కు బయలుదేరాడు. మొకర్లాబాద్ సమీపానికి రాగానే బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో తలకు, కాలికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించారు. అంబులెన్సులో అతడిని చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆనంద్‌మేళా ప్రారంభం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక వేపూరిగేరిలోని భీమలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం రాజస్థాని మహిళా మండలి ఆధ్వర్యంలో ఆనంద్‌మేళా ప్రారంభించారు. ఈ మేళాను బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతి కుమార్ పరిశీలించారు.

అప్‌డేట్ చేయించుకోండి

గండేడ్: ఉచిత విద్యుత్ కోసం ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలని ఏఈ శ్రీకాంత్ తెలిపారు. ఆధార్‌తో పాటు రేషన్ కార్డు, ఫోన్ నంబరు, ప్రజాపాలనలో ఇచ్చిన రశీదులను జిరాక్స్ ఇవ్వాలని సూచించారు.

ఎంపీకి ఆహ్వానం

నవాబుపేట: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా ఈ నెల 15న ఊరంచుతండాలో మహాభోగ్ కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులను ఆహ్వానించినట్లు నిర్వాహకులు లింబ్యానాయక్, రాములునాయక్, శంకర్‌నాయక్ శనివారం తెలిపారు.

వాల్‌పోస్టర్ విడుదల

జడ్చర్ల: నల్గొండలో ఈనెల 13న బీఆర్‌ఎస్ తలపెట్టిన బహిరంగ సభను విజయవంతం చేయాలని జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య పిలుపునిచ్చారు. శనివారం అంబేడ్కర్ చౌరస్తాలో వాల్ పోస్టర్లను విడుదల చేశారు. మండల అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు మురళీ నాయకులు పాల్గొన్నారు.
అడ్డాకుల: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ రంగన్నగౌడ్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం పక్కాగా..

గండేడ్/మహమ్మదాబాద్: డీఆర్‌డీఓ యాదయ్య, డీపీఓ వెంకటేశ్వర్లు శనివారం గాధిర్యాల్, రంగారెడ్డిపల్లి, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో డ్రైవ్‌ను పరిశీలించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని అధికారులకు సూచించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శంకర్‌నాయక్ ఉన్నారు.
బాలానగర్: హేమాజీపూర్, నేలబండ తండాల్లో పారిశుద్ధ్య వారోత్సవాల స్పెషల్ డ్రైవ్‌ను మండల ప్రత్యేక అధికారి బాబురావ్, ఎంపీడీఓ కృష్ణారావుతో కలిసి పరిశీలించారు. పలు సూచనలు చేశారు.

ఎఫ్‌టీఎల్ సర్వే అడ్డగింత



రాజాపూర్: మండలంలోని రంగారెడ్డిగూడ గ్రామ శివారులో ఉన్న మైసమ్మకుంటలో ఇరిగేషన్‌శాఖ అధికారులు ఎఫ్‌టీఎల్ సర్వేచేసేందుకు వెళ్లడంతో స్థానిక జెడ్పీటీసీ మోహన్‌నాయక్ శనివారం అడ్డుకున్నారు. దీంతో వారు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే ఎస్‌ఐ రవితో పాటు సిబ్బంది అక్కడికి చేరుకుని సర్వేను చేయించారు. నెల రోజుల సమయం ఇచ్చి సర్వే చేసుకోవాలని.. తమ భూములు అక్కడ ఉన్నాయని జెడ్పీటీసీ ఈ సందర్భంగా పోలీసులకు తెలిపారు. కాగా మార్కింగ్ చేస్తే ఇబ్బందులు ఎందుకుంటాయని కుంట అక్రమణకు గురైందా లేదా రెవెన్యూ అధికారులకు సర్వే నంబర్ ద్వారా తిరిగి సర్వే చేస్తారని ఎస్‌ఐ అన్నారు. అనంతరం అధికారులు సర్వేను పూర్తి చేశారు.

బాండ్ డబ్బుల విడుదలపై హర్షం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాష్ట్ర ప్రభుత్వం తమకు రావాల్సిన బాండ్ డబ్బులను విడుదల చేయడంతో ఆర్టీసీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం మహబూబ్‌నగర్ డిపో ప్రాంగణంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ప్రతి ఒక్కరికీ సుమారు రూ.లక్ష వరకు అందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు రాంజీ, జైరాం, వెంకటయ్య, చంద్రమోహన్, తిరుపతయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.



బడ్జెట్‌పై మిశ్రమ స్పందన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాష్ట్ర బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారాం డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీల అభివృద్ధికి కేటాయించిన రూ.500 కోట్లు కనీస సౌకర్యాలకైనా సరిపోవన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం తగదన్నారు. కొఠారి కమిషన్ ప్రతిపాదించిన 30 శాతం నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మారుతి, కోశాధికారి శివకుమార్, సంఘం నాయకులు సంజీవ్, అరుణ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహం ఇవ్వాలి..



బడ్జెట్‌లో రూ.21 వేల కోట్లను విద్యారంగానికి కేటాయించింది. మరిన్ని నిధులు కేటాయించి బడులను, యూనివర్సిటీలను బలోపేతం చేసే దిశగా నిర్ణయాలు ఉండాలి. గత ప్రభుత్వం నెలల తరబడి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసింది. ఈ ప్రభుత్వం స్కాలర్‌షిప్, ఫీజురీయంబర్స్‌మెంట్ కోసం ప్రత్యేకంగా రూ.500 కోట్లు కేటాయిస్తే తక్షణం సమస్యల పరిష్కారమవుతుంది.

– భరత్, ఎస్‌ఎఫ్‌ఐ, జిల్లా అధ్యక్షుడు

వ్యాపార రంగంతోనే..



వ్యాపార రంగానికి ప్రభుత్వం మరింత చేయూత ఇస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెంది ముందుకు సాగుతుంది. ఒక ప్రాంతం, ఒక రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వ్యాపార రంగం ప్రధాన భూమిక పోషిస్తుంది. అందుకు ప్రభుత్వాలు రాజకీయాలకు అతీతంగా వ్యాపార రంగాన్ని అభివృద్ధి చేసేందుకు పూనుకోవాలి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వ్యాపారాలను గుర్తించి వారికి చేయూతనందించాలి.

– కోట్ల రాజు, వ్యాపారి, నవాబ్‌పేట

ప్రత్యేక జీవో ద్వారా..



పెన్షనర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలి. వారికి అందే ప్రతినెల పెన్షన్ మొదటి, రెండో తేదీలోనే చెల్లించేలా ప్రత్యేక జీఓ విడుదల చేయాలి. రిటైర్డు అయిన ఉద్యోగులు పెన్షన్ పైనే ఆధారపడతారు. అందుకు వారికి చేయూత ఇచ్చేలా చేస్తే బాగుంటుంది.

– వెంకటయ్య, రిటైర్డ్ టీచర్, నవాబ్‌పేట

ఆరు గ్యారంటీలకు..



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. ఆరు గ్యారంటీల అమలుకు కావాల్సిన నిధులను కేటాయించడం వల్ల మహిళలకు రూ.500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేసే అవకాశం లభించింది.

– గద్దమీది చంద్రకళ, గృహిణి, దేవరకద్ర

సంక్షేమానికి పెద్దపీట



బడ్జెట్ ఎవరిని ఇబ్బందులకు గురిచేయకుండా.. వడ్డింపుల ప్రస్తావన లేకుండా అందరిని తృప్తిపర్చేలా ప్రయత్నించారు. సంక్షేమానికి పెద్ద పీటవేసినట్లు స్పష్టంగా కనిపిస్తుంది. నీటిపారుదల శాఖ, వ్యవసాయానికి నిధుల కేటాయింపు మరింత పెంచితే బాగుండేది. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ అయినప్పటికీ భవిష్యత్‌లో ఏం చేయబోతున్నారనే విషయం బడ్జెట్ ద్వారా బహిర్గత పర్చినట్లయ్యింది.

– ఆలంపల్లి మనోహర్, వ్యాపారవేత్త, బాదేపల్లి

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

రాజాపూర్: యాసంగి సమయంలో వరిని కాండం తొలుచు పురుగు ఎక్కువగా ఆశిస్తుందని నివారణకు రైతులు ముందస్తుగా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి నరేందర్ సూచించారు. శనివారం కుచ్చర్‌కల్‌లో వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఎకరానికి 3 లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలని తెలిపారు.

ఇంటింటి సర్వే పరిశీలన

దేవరకద్ర: పట్టణంలోని దళితవాడలో రూ. 500 లకే గ్యాస్ సిలిండర్ పథకం అమలు కోసం శనివారం లబ్ధిదారుల ఇంటింటి సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు సంబంధించిన జాబితాను, సెల్ ఫోన్‌లో నమోదు చేసిన వివరాలను మండల ప్రత్యేక అధికారి రవీంద్రనాథ్, మేజర్ పంచాయతీ ఈఓ సీత్యానాయక్‌లు పరిశీలించారు. అంగన్‌వాడీలకు సూచనలు చేశారు.

వైభవంగా వేంకటేశ్వర కల్యాణం



వేములలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



కల్యాణానికి హాజరైన గ్రామస్తులు

అడ్డాకుల: వేములలో శనివారం రాత్రి లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. తిరుమల తిరుపతి మహా పాదయాత్రలో భాగంగా 21వ రోజు గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం ముందు వేదపండితులు కల్యాణాన్ని జరిపించారు. గడప గడపకు గోవు, గోవిందుడు, గీత కార్యక్రమాన్ని గట్టు రంగాచార్యుల సంకల్పంలో భాగంగా తిరుపతిగారి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. కల్యాణం అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. భగవద్గీతపై ప్రచారం, గో ఆధారిత వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ రహిత గ్రామాల ఏర్పాటు, నక్షత్రవనం మొక్కలు నాటడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని చేపట్టినట్లు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రాత్రి ఆలయం వద్ద గ్రామస్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మహిళలు, యువకులు పాల్గొన్నారు.



గండేడ్: వెన్నాచేడ్‌లో లక్ష్మీవేంకటేశ్వరస్వామికి కళాకర్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు, పూజారులు కలశాలతో నీటిని తీసుకువచ్చి గణపతి పూజ నిర్వహించారు. అనంతరం స్వామి వారికి అభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి, శివమల్లప్ప, రాములు, శరణప్ప, పూజారులు తదితరులు పాల్గొన్నారు.